ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలి

- అంటరానితనం, కులవివక్షపై ఐదేళ్లకోసారి సర్వే చేపట్టాలి
- దళితులకు భూపంపిణీ ఎజెండా కావాలి
- ఎస్సిలకు విద్య, ఉపాధి, వ్యాపారం హక్కు ఉండాలి
- జాతీయ దళిత్ సమ్మిట్‌లో ప్రొఫెసర్ సుఖ్‌దేవ్ థోరట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో అత్యంత వెనుకబడిన ఉన్న దళితులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి కావాలంటే, వారి సాధికారతకు పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) మాజీ చైర్మెన్ ప్రొఫెసర్ సుఖ్‌దేవ్ థోరట్ చెప్పారు. ప్రభుత్వరంగంతోపాటు ప్రయివేటు రంగంలోనూ రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ ఆధ్వర్యంలో రెండ్రోజులపాటు నిర్వహించిన జాతీయ దళిత్ సమ్మిట్ ఆదివారం హైదరాబాద్‌లో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన సుఖ్‌దేవ్ థోరట్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లయినా దళితులపై అంటరానితనం, వివక్ష, అణచివేత, దాడులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని చెప్పారు. 1950 వరకు ఎలాంటి హక్కుల్లేవని, బానిసలుగా బతికారని గుర్తు చేశారు. దళితులు చదువుకునే హక్కు లేదు, ఉద్యోగం చేసే హక్కులేదు, సమానంగా జీవించే హక్కు లేదని అన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అమల్లోకి వచ్చాక వారికి హక్కులు కల్పించబడ్డాయని వివరించారు. రాజకీయ రంగంతోపాటు విద్యా, ఉద్యోగాల్లో దళితులకు రిజర్వేషన్లు కల్పించబడ్డాయని చెప్పారు. రాజ్యాంగం ప్రకారం అందరూ సమానమేనని, వివక్షను, అంటరానితనాన్ని నిర్మూలించారని అన్నారు. దళితులపై వివక్ష చూపితే శిక్షించేందుకు అట్రాసిటీ చట్టాన్ని తెచ్చారని చెప్పారు. దళితుల జనాభా ఎంత ఉంటే అదే దామాషా ప్రకారం రాజకీయ, విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్ వర్తిస్తుందన్నారు. ఇతరులతో సమానంగా తీర్చిదిద్దేందుకు ఇది కొంత దోహదపడిందని వివరించారు. అందులో భాగంగా దళితులు ఉద్యోగులుగా, అధికారులుగా, మంత్రులుగా అవుతున్నారని గుర్తు చేశారు. అయితే ప్రభుత్వరంగంలో 20 శాతం ఉద్యోగాలున్నాయని చెప్పారు. ప్రయివేటు రంగంలో 80 శాతం ఉద్యోగాలు లభిస్తున్నాయని అన్నారు. కానీ అక్కడ రిజర్వేషన్లు అమలు కావడం లేదన్నారు. అందుకే ప్రయివేటు రంగంలోనూ రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరముందని కోరారు. భూమి లేని పేదల్లో ఎక్కువ మంది దళితులే ఉన్నారని చెప్పారు. వారికి భూపంపిణీ ఎజెండా కావాలన్నారు. తలసరి ఆదాయంలో ఒబిసి, ఒసిల కంటే దళితులు తక్కువ స్థాయిలో ఉన్నారని వివరించారు. పేదరికంలో దళితులే అధికంగా ఉన్నారని అన్నారు. అనేక చట్టాలు, పథకాలు అమలు చేస్తున్నా దేశంలో పేదరికం తగ్గడం లేదన్నారు. పేదరికంలో ఒసిలు తొమ్మిది శాతం ఉంటే, దళితులు 30 శాతం ఉన్నారని వివరించారు. భూమి, పక్కా ఇళ్లు, తాగునీరు, డ్రయినేజీ, చదువు, ఉద్యోగం, ఆరోగ్యం, వ్యాపారం ఇలా ఏ రంగంలో చూసినా దళితులు వెనుకబడే ఉన్నారని చెప్పారు. ఉన్నత విద్య చదివే వారు ఒసిలు 41 శాతం ఉంటే, దళితులు 21 శాతం ఉన్నారని అన్నారు. దేశంలో సంపద ఒసిల వద్ద 45 శాతం, ఒబిసిల వద్ద 31 శాతం, ఎస్సీల వద్ద ఏడు శాతం ఉందని వివరించారు. రెగ్యులర్ సాలరీ వచ్చే ఉద్యోగుల్లో దళితులు తక్కువగా ఉన్నారని చెప్పారు. అయితే ఎక్కువమంది క్యాజువల్ కార్మికులుగా తక్కువ జీతానికి పనిచేస్తున్నారని వివరించారు. దీంతో వారు సొంత ఇల్లు లేక, గౌరవంగా జీవించేందుకు సరిపోను ఆదాయం లేక, పౌష్టికాహారం లేక, పేదరికంలో మగ్గుతున్నారని అన్నారు. దళిత వ్యాపారవేత్తలు, రైతులూ వివక్షను అనుభవిస్తున్నారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో దళితులను దేవాలయాల్లోకి రానివ్వడం లేదని, రోడ్లపై తిరగనివ్వబోరని, హోటళ్లలో వివక్ష ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. అంటరానితనం లేని గ్రామాలను తీర్చిదిద్దేందుకు పది గ్రామాలకు ఒక కార్యదర్శిని నియమించాలని సూచించారు. పేదరికం, ఉపాధి, జనగణనపై పదేళ్లకోసారి సర్వే చేస్తున్నట్టుగానే అంటరానితనం, కులవివక్షపైనా ఐదేళ్లకోసారి సర్వే చేయాలని కోరారు. అందరూ సమానమేననంటూ రాజ్యాంగం చెప్తున్నా అందుకు విరుద్ధంగా వ్యవహరించే తీరుపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఎస్సి రైతుల కోసం ప్రత్యేక రాయితీలు కల్పించాలని, వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్, ఇతర వస్తువులు కొనేందుకు ఆర్థిక సహాయం చేయాలని కోరారు. దళితులు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రభుత్వం ప్రోత్సహించాలన్నారు. భూమి లేని దళితులకు భూపంపిణీ చేయాలని, ఇది ఎజెండా కావాలని సూచించారు. ప్రయివేటు విద్యారంగం విస్తరిస్తున్నదని, అధిక ఫీజులు, వివక్ష వల్ల అక్కడ దళితులు చదువుకునే పరిస్థితి లేదని చెప్పారు. 45 శాతం విశ్వవిద్యాలయాలు, 65 శాతం కాలేజీలు, 67 శాతం పాఠశాలలు ప్రయివేటురంగంలో ఉన్నాయని వివరించారు. అందరికీ విద్య కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. దళితులకు విద్యా, ఉపాధి, వ్యాపారం హక్కుగా ఉండాలన్నారు. అప్పుడే దళితులు అందరితో సమానంగా అభివృద్ధి చెందుతారనీ, వారిలో సాధికారత సాధ్యమవుతుందని కోరారు.

మణిపూర్ సిఎం రాజీనామా చేయాలని తీర్మానం

మణిపూర్‌లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలు, గిరిజన మహిళలపై లైంగిక దాడులు, హత్యలను జాతీయ దళిత్ సమ్మిత్ తీవ్రంగా ఖండిస్తున్నట్టు మాజీ ఎంపి రామచంద్రడోమ్ చెప్పారు. ఆ ఘటనలకు బాధ్యత వహిస్తూ మణిపూర్ సిఎం బీరెన్‌సింగ్ రాజీనామా చేయాలని ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ప్రతినిధులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. అక్కడ శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని కోరారు. ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనిపై ప్రధాని నరేంద్రమోడీ మౌనం వహించడం సరైంది కాదని చెప్పారు. గద్దర్ మరణం పట్ల సంతాప సూచకంగా ప్రతినిధులు రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. సిపిఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా మాట్లాడుతూ ఐదు దశాబ్దాల్లో ఎప్పుడూ లేనిస్థాయిలో ప్రస్తుతం నిరుద్యోగం పెరిగిపోయిందని చెప్పారు. సమానత్వం, అంటరానితనం నిర్మూలన రాజ్యాంగంలో ఉన్నా అమలు కావడం లేదన్నారు. ఇప్పటికీ గ్రామాల్లో రెండు గ్లాసుల పద్ధతి అమల్లో ఉందని అన్నారు.

ఎస్‌వికె మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయకుమార్ మాట్లాడుతూ కులాంతర వివాహాల ప్రోత్సాహకం కేంద్ర ప్రభుత్వం 500 మందికే ఇవ్వడం సరైంది కాదన్నారు. ఆ నిబంధనను తొలగించాలని డిమాండ్ చేశారు. కులాంతర వివాహాలు చేసుకున్న వారికి రక్షణ కల్పించాలని కోరారు. కులదురహంకార హత్యలను ఆపాలన్నారు. కులాంతర వివాహాల దరఖాస్తులు రాష్ట్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని సూచించారు. కులాంతర వివాహం చేసుకున్న ఒబిసిలకూ నగదు ప్రోత్సాహకం వర్తింపచేయాలని కోరారు. దళితులు, ఆదివాసీల సమస్యలను పరిష్కరించడంలో కెసిఆర్ ప్రభుత్వం విఫలమైందని బికెఎంయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్క బాలమల్లేష్ విమర్శించారు. రామచంద్ర డోమ్, ప్రొఫెసర్ కృష్ణ, విక్రంసింగ్, పి రామ్మూర్తి, సత్యదేవ్ రామ్, దేవి కుమారి అధ్యక్షవర్గంగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో మల్లేపల్లి లక్ష్మయ్య, విఎస్ నిర్మల్, ధీరేంద్ర ఝా, గుల్జార్‌సింగ్ గోరియా, బి వెంకట్, జాన్‌వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టి నాగరాజు

పెండింగ్ స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

- నాణ్యతలేని 'మన్న ట్రస్ట్' మధ్యాహ్న భోజనం
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి నాగరాజు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెండింగ్‌లో ఉన్న రూ.5,177 కోట్ల స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు డిమాండ్ చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో పాఠశాల విద్యార్థులకు మన్న ట్రస్ట్ ద్వారా సరఫరా చేస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతగా లేదని, వెంటనే కాంట్రాక్టును రద్దు చేయాలన్నారు. ఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ముఖ్య నాయకుల సమావేశం జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన నాగరాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్‌లో సమస్యలు అలాగే ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం యూనివర్సిటీ ఫీజులు పెంచి పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తుందని విమర్శించారు. ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో భారీగా పెంచిన ఫీజులను తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మూడు రోజులు నిర్వహించిన అధ్యయన యాత్రలో వెలుగులోకి వచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్టు తెలిపారు. ఒక్క బిల్డింగ్‌లోనే మూడు నుంచి నాలుగు గురుకుల పాఠశాలలు కొనసాగుతున్నాయన్నారు. 1200 నుంచి రెండు వేల మంది విద్యార్థులకు ఒక్కరే ప్రిన్సిపల్, ఆరుగురు టీచర్లు, మరికొంత మంది కాంట్రాక్ట్ టీచర్లు మాత్రమే ఉండటం సిగ్గు చేటన్నారు. ఇలా ఉంటే విద్యార్థులకు చదువులో ఎలా న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మన్న ట్రస్ట్ ద్వారా సరఫరా చేస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతగా లేకపోవడంతో విద్యార్థులు అన్నం కూడా తినడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే మన్న ట్రస్టు కాంట్రాక్టును రద్దు చేసి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కోరారు. సంక్షేమ హాస్టల్స్‌లో విద్యార్థులకు సరిపడా కూరలు, గుడ్లు, పండ్లు ఇవ్వడం లేదన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, లేదంటే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు కార్తీక్, జిల్లా సహాయ కార్యదర్శులు అరుణ్, వంశీ, జిల్లా కమిటీ సభ్యులు కార్తీక్, శివ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి డిక్లరేషన్‌ను దేశవ్యాప్తంగా ప్రకటించాలి

- మంత్రి సత్యవతి రాథోడ్ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్‌సి, ఎస్‌టి డిక్లరేషన్‌ను కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా అమలు చేయాలని రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని బిఆర్ఎస్ ఎల్‌పి కార్యాలయంలో ఎంపి కవిత, ప్రభుత్వ విప్ ఎంఎస్ ప్రభాకర్‌రావు, ఎమ్మెల్సీ తక్కెళ్ల పల్లి రవీందర్‌రావుతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ చేవెళ్లలో ప్రకటించిన డిక్లరేషన్ మోసపూరితమైందని విమర్శించారు. దేశంలో ఎస్‌సి, ఎస్‌టిలు వెనుకబాటుకు కాంగ్రెస్ కారణమన్నారు. కర్ణాటకలో ఇచ్చిన ఒక్క హామీనీ అమలు చేయలేదని తెలిపారు

నోరు విప్పరేం..!

- ఎంఐఎంతో దోస్తానా సరే...
- బిజెపి పట్ల బిఆర్ఎస్ వైఖరేంటి?
- సరెండరా... సమదూరమా?
- బిఆర్ఎస్ అధినేత వైఖరిపై సర్వత్రా చర్చ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'బిజెపి దేశానికి పట్టిన పీడ... కేంద్రంలో ఆ పార్టీ ఓడిపోతేనే దేశం బతికి బట్టకడుతుంది' నిన్నమొన్నటి వరకు భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) అధినేత, ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు జాతినుద్దేశించి చేసిన ప్రసంగమిది. బిజెపిని ఓడించేందుకు, దాన్ని ఏకాకిని చేసేందుకు దేశంలోని ప్రాంతీయ పార్టీలను ఏకం చేసే ప్రణాళికలు రచించారు. కానీ కొంత కాలంగా ఆయనలో, ఆ పార్టీ ముఖ్య నేతల్లో వచ్చిన మార్పు విస్మయానికి గురి చేస్తున్నది. ఇటీవల ఆ పార్టీ ఇంటా, బయటా నిర్వహించిన బహిరంగ సభల్లో కాంగ్రెస్‌ను మాత్రమే టార్గెట్ చేస్తున్నారు. బిజెపిని పల్లెత్తు మాట అనేందుకూ సాహసించట్లేదు. హిందుత్వ అజెండాతో దూకుడు ప్రదర్శిస్తూ, నిత్యం వివాదాస్పదుడిగా మారిన బిజెపి మాజీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌ను ఆ పదవి బిజెపి అధిష్టానం తప్పించినప్పుడే బిజెపి-బిఆర్ఎస్ దోస్తానా వెల్లడైందని ఇరు పార్టీల్లోనూ చర్చ జరిగింది. సిఎం కెసిఆర్‌కు నమ్మకస్తుడైన కేంద్రమంత్రి జీ కిషన్‌రెడ్డికి బిజెపి పార్టీ అధ్యక్ష పదవి కట్టబెట్టగానే దోస్తానా ఖరారైందనే ప్రచారం పీక్ స్టేజ్‌కి వెళ్లింది. కర్ణాటక ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ఊపందుకుంటున్నదనే ఇంటలిజెన్స్ వర్గాల రిపోర్టుల ఆధారంగా బిఆర్ఎస్ అధినేత తన రాజకీయ వ్యూహాన్ని మార్చుకున్నారనే చర్చా కొనసాగింది. ఈ సయోధ్య ఫలితంగానే లిక్కర్ స్కాంలో కవిత విచారణ మందగించిన విషయమూ వాస్తవమే అని బిఆర్ఎస్ పార్టీ నేతల్లోనూ చర్చజరగుతుంది.

కమ్యూనిస్టులతో కటీఫ్

మొన్నటి వరకు బిఆర్ఎస్‌కు బిజెపియే ప్రత్యామ్నాయం...కాంగ్రెస్ మునిగిపోతున్న నావ అని చెప్పిన కెసిఆర్ ఇప్పుడు ఎందుకు మాట మార్చారనేదానిపై స్పష్టత ఇంకా రాలేదు. మునుగోడు ఎన్నికల టైంలో కమ్యూనిస్టులతో కలిసి ఒకే వేదిక పంచుకుని, తమ బంధం భవిష్యత్‌లోనూ కొనసాగుతుందని ఆయనే స్వయంగా ప్రకటించారు. ఆ తర్వాత ఆ మాటల్ని ఆయనే ఖండించుకున్నారు. ఏకపక్షంగా బిఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించి, 'అన్ని స్థానాల్లో అభ్యర్థుల్ని ప్రకటించాక ఇక పొత్తులేంది? అని ముక్తసరి సమాధానంతో సరిపుచ్చారు. అదే సమయంలో ఇప్పటి వరకు బిజెపిపైనా, మోడీపైనా ప్రదర్శించిన దూకుడును కొనసాగిస్తారో లేదో స్పష్టత ఇవ్వలేదు. టిఆర్ఎస్ పేరును బిఆర్ఎస్‌గా మార్చి, జాతీయ పార్టీగా ప్రకటించి బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు సమదూరంగా ఉంటామంటూ గర్జించిన విషయం తెలిసిందే. కానీ ఇప్పుడు బిజెపి పట్ల మెతక వైఖరి అవలంబిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రాజ్‌భవన్‌పై అనుమానాలు తీరాయా?

దేశ వ్యాప్తంగా పోటీ చేసి మతతత్వ బిజెపిని ఓడించి సత్తా ఏంటో చూపిస్తామంటూ కెసిఆర్ హడావుడి చేశారు. 'అబ్ కీ బార్...కిసాన్ సర్కార్' అనే నినాదాన్ని ఎత్తుకున్నారు. కానీ ప్రస్తుతం రాష్ట్రానికే పరిమితమైనట్టు తెలుస్తోంది. పట్నం మహేందర్‌రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా సిఎం, గవర్నర్ మధ్య ఏర్పడిన అగాధం పూడిపోయినట్టు మీడియాలో కథనాలు వచ్చాయి. ఆ మరుసటి రోజే కొత్త సచివాలయంలోని గుడి, చర్చి, మసీదును సిఎం కెసిఆర్ గవర్నర్‌తో కలిసి ప్రారంభించారు. దీంతో బిజెపికి, బీఆర్ఎస్ మరింత దగ్గరవుతున్నదనే సంకేతాలు వెలువడ్డాయి.

ఇక్కడ మేమే...అక్కడ మీరే..!

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం కోసం బిజెపి సహకరించేలా...పార్లమెంటు ఎన్నికల్లో బిఆర్ఎస్, బిజెపికి సహకరించేలా రెండు పార్టీల మధ్య సూత్రప్రాయంగా అంగీకారం కుదిరిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే ఇక్కడొక్క చిక్కు ప్రశ్న కూడా ఉందని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఎంఐఎం పార్టీతో బిఆర్ఎస్ ఫ్రెండ్లీ ఒప్పందాన్ని కొనసాగిస్తున్నది. మరోవైపు బిజెపితో స్నేహం కొనసాగించేందుకు సిద్ధమవుతోంది. ఎంఐఎం, బిజెపి రెండూ మతతత్వంతో కూడిన భిన్న ధృవాలు. ఆ రెండు పార్టీలతో స్నేహం కొనసాగించడం కారును ప్రమాదాలకు గురిచేస్తుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత కేంద్రంలో ఏర్పడబోయే ప్రభుత్వంలో బిఆర్ఎస్ కీలకంగా మారబోతోందని మంత్రి కెటిఆర్ చెప్పడంతో ఈ రెండు పార్టీల మధ్య బంధం బలపడుతోందనే బలమైన వాదనలు వినిపిస్తున్నాయి.

బిజెపి సభకు ఆర్‌టిసి బస్సులు..

ఖమ్మం సభావేదికగా బిజెపి, బిఆర్ఎస్ దోస్తీ బట్టబయలు అయ్యింది. గతంలో ఖమ్మంలో కాంగ్రెస్ యువనేత రాహుల్ గాంధీ చేపట్టిన 'జనగర్జన' సభకు కెసిఆర్ సర్కార్ ఆర్‌టిసి బస్సులు ఇవ్వలేదు. పైగా పొంగులేటి అనుచరులు, కార్యకర్తలు, అభిమానులు జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలిరాగా వారిని ఎక్కడికక్కడ అడ్డుకోవడం అప్పట్లో పెద్ద చర్చకు దారితీసింది. ఆదివారం అమిత్ షా సభకు మాత్రం పెద్ద ఎత్తున ఆర్‌టిసి బస్సులు తరలివెళ్లాయి. బిజెపి బహిరంగ సభను విజయవంతం చేసేందుకు ఆర్‌టిసి బస్సులు ఇచ్చింది. ఇలా చేయడం బిఆర్ఎస్, బిజెపి మధ్య దోస్తీ ఉన్నట్టు కాదా? అసలు ఇదంతా దేనికి సంకేతం..? అని కాంగ్రెస్ విమర్శలు గుప్పిస్తోంది. గత కొన్ని రోజులుగా బిఆర్ఎస్, బిజెపి మధ్య చీకటి ఒప్పందం ఉందని.. దోస్తీగా మెలుగుతున్నాయని కాంగ్రెస్ చేసిన ఆరోపణలు నిజమేనని ధృవీకరిస్తున్నట్టే ఉంది. రాష్ట్రంలో వేగంగా మారుతున్న రాజకీయ సమీకరణాలు ప్రజల్లో మరింత చర్చను రేకెత్తిస్తుండటం గమనార్హం!

ఓల్డ్ సిటీ మెట్రో పనుల కోసం డ్రోన్ సర్వే

- మెట్రో ఎండి ఎన్‌విఎస్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓల్డ్ సిటీ మెట్రో రైలు పనుల కోసం డ్రోన్ సర్వేను హెచ్ఎంఆర్ఎల్ అధికారులు చేపట్టారు. సిఎం కెసిఆర్ ఆదేశాల మేరకు పాతబస్తీలో మెట్రో రైలు అలైన్‌మెంట్, ప్రభావిత ఆస్తులు, తదితరాలపై డ్రోన్ సర్వేను ప్రారంభించినట్టు హైదరాబాద్ మెట్రో రైలు ఎండి ఎన్‌విఎస్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సంప్రదాయక సర్వేతో పాటు, దారుల్-షిఫా జంక్షన్ నుంచి శాలిబండ జంక్షన్ మధ్య ఇరుకైన మార్గంలో రహదారి విస్తరణ, మెట్రో స్టేషన్ల నిర్మాణానికి అవసరమైన ప్రభావిత ఆస్తుల కచ్చితమైన కొలతలు తీసుకోవడానికి డ్రోన్ సర్వే చేపట్టినట్టు తెలిపారు. మొత్తం 103 మతపరమైన, ఇతర సున్నితమైన నిర్మాణాల రక్షణ మెట్రో నిర్మాణానికి ప్రధాన సవాలుగా ఉన్నాయని, వాటిని రక్షించడానికి తగిన ఇంజనీరింగ్ పరిష్కారాలను రూపొందించడంలో డ్రోన్ సర్వే సహాయపడుతుందని పేర్కొన్నారు. మెట్రో అలైన్‌మెంట్, పిల్లర్ లొకేషన్లు ఈ నిర్మాణాలపై ఎటువంటి ప్రతికూల ప్రభావం చూపకుండా ప్లాన్ చేస్తున్నామని చెప్పారు. డ్రోన్ సర్వే ద్వారా రియల్ టైమ్ డేటా, 3డీ మోడలింగ్, జిఐఎస్ (జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్) డేటా, క్యాడ్ సాఫ్ట్‌వేర్ ఏకీకరణ, డేటా విశ్లేషణ విజువలైజేషన్‌ను త్వరితగతిన సేకరించవచ్చని తెలిపారు. మరికొద్దిరోజుల్లోనే భూసామర్థ్య పరీక్షలు ప్రారంభించడానికి టెండర్లు ఖరారు చేస్తామని పేర్కొన్నారు.

మంత్రి వర్సెస్ వట్టె జానయ్య యాదవ్

- పోటాపోటీగా ఆందోళనలు
- ఒకే రోజు వట్టెపై 71కి పైగా కేసులు
- జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మతో శవయాత్ర

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దాదాపు తొమ్మిదిన్నరేళ్ల పాటు సూర్యాపేట జిల్లాలో ఏకచక్రాధిపత్యం వహించిన బిఆర్ఎస్ కోటకు క్రమంగా బీటలు బారుతున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీలో తన మాటే వేదంగా సాగిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డిపై భారీస్థాయిలో విమర్శల పర్వం కొనసాగడం రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇన్నాళ్లు మంత్రి ప్రధాన అనుచరునిగా ఉంటూ వచ్చిన డిసిఎంఎస్ చైర్మెన్ వట్టె జానయ్యయాదవ్ మంత్రికి ఎదురుతిరగడం.. గతంలో ఎన్నడూలేని విధంగా వట్టెపై భారీగా ఫిర్యాదులు వెల్లువెత్తుతుండటం వెనుక రాజకీయ కుట్ర కోణం దాగిందనే ప్రచారం లేకపోలేదు. ఈ నేపథ్యంలో సూర్యాపేట పట్టణంలో ఆదివారం ఒక్కసారిగా ధర్నాలతో వేడెక్కింది. అక్రమ కేసులు ఎత్తివేయాలంటూ వట్టెకు మద్దతుగా కొంతమంది ధర్నా చేస్తే.. తమ భూములు తమకు ఇప్పించాలంటూ మరికొంతమంది జనగామ క్రాస్‌రోడ్డులో ధర్నాకు దిగారు. దాంతో పేటలో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం హీటెక్కింది.

పేటలో పోటాపోటీగా ఆందోళనలు..

మంత్రి జగదీశ్‌రెడ్డి, డిసిఎంఎస్ చైర్మెన్ వట్టె జానయ్యయాదవ్ మధ్య రగిలిన చిచ్చు కాస్త రచ్చకెక్కింది. జానయ్యను అరెస్టు చేయాలంటూ బాధితులు పోలీసుస్టేషన్‌కు క్యూ కడుతున్నారు. జానయ్య భూఆక్రమణలను నిరసిస్తూ జనగామ క్రాస్‌రోడ్డులో బాధితులు ధర్నాకు దిగారు. అంతేకాదు, వట్టె నుంచి తమకు ప్రాణహాని ఉందంటూ పలువురు బాధితులు ఆరోపించారు. మరోవైపు బడుగు బలహీన తరగతులకు న్యాయం చేయాలని అడిగినందుకు మంత్రి కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారంటూ వట్టెకు మద్దతుగా బిసి, ఎస్‌సి, ఎస్‌టి సంఘాల నేతలు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. అనంతరం మంత్రి తీరును నిరసిస్తూ వందలాది మంది స్థానికులు మంత్రి దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించారు.

వట్టె జానయ్యయాదవ్‌పై అక్రమ కేసుల్ని వెంటనే ఎత్తివేయాలని ఆయన సతీమణి, సూర్యాపేట మున్సిపాలిటీ 13వ వార్డు కౌన్సిలర్ వట్టె రేణుక డిమాండ్ చేశారు. బహుజన వాదం ఎత్తుకున్నందుకే మంత్రికక్షగట్టి తన భర్తపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు. మంత్రి దగ్గర ఉన్నప్పుడు మంచివాడైన తన భర్త ఇప్పుడు ఎలా కబ్జాకోరు అయ్యాడో మంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక్క రోజు దాదాపు 71 కేసులు పెట్టడం వెనుక మంత్రి ప్రోద్భలం ఉన్నదని, తన భర్తకు ఏదైనా ప్రాణహాని జరిగితే దానికి బాధ్యత మంత్రి దేనని తేల్చిచెప్పారు. అనంతరం ఆమె జానయ్యయాదవ్ అభిమానులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. పోలీసులు ముందస్తుగా రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద బారికేడ్స్ ఏర్పాటు చేసి కట్టడి చేశారు. ర్యాలీగా వస్తున్న వారిని అరెస్ట్ చేస్తారని మొదట భావించినా.. పోలీసులు వారికి నచ్చజెప్పి వెనక్కు పంపించారు.

జగదీశ్‌రెడ్డి చిట్టా నా దగ్గర ఉంది...

బడుగు, బలహీనవర్గాలకు సరైన న్యాయం చేయాలని అడిగితే.. నాపై కక్షగట్టారు. ఇన్నేళ్ల పాటు లేని కేసులు ఒక్కరోజే 60కి పైగా పెట్టారంటే.. పరిస్థితి ఏంటో అర్థం చేసుకోండి. నాపై వచ్చిన ఆరోపణలకు నేను బహిరంగ చర్చకు సిద్ధం. మంత్రి జగదీశ్‌రెడ్డి తొమ్మిదిన్నరేళ్ల కాలంలో అక్రమంగా సంపాదించిన రూ.వేల కోట్లు ఎక్కడ దాచిపెట్టారో వెలుగులోకి తీసుకొస్తా. నాడు స్కూటర్‌పై తిరిగిన వ్యక్తికి ఇన్ని రూ.వేల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలి. బిసి, ఎస్సి, ఎస్టిల కోసం ప్రశ్నిస్తే.. ఇంతకు దిగజారడం సరికాదు.

వట్టె జానయ్యయాదవ్, డిసిసిఎంఎస్ చైర్మెన్

రేపు విద్యాశాఖ కార్యాలయం ముట్టడి

- డిఎడ్, బిఎడ్ అభ్యర్థుల సంఘం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు ప్రకటించిన విధంగా 13,500 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డిఎస్‌సి నోటిఫికేషన్‌ను జారీ చేయాలని కోరుతూ మంగళవారం పాఠశాల విద్యాశాఖ కార్యాలయాన్ని తెలంగాణ రాష్ట్ర డిఎడ్, బిఎడ్ అభ్యర్థుల సంఘం తెలిపింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావుల రామ్మోహన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరేళ్లుగా నాలుగు లక్షల మంది అభ్యర్థులు ఉపాధ్యాయ పోస్టుల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం కేవలం 5,089 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామంటూ ప్రకటించడంతో అభ్యర్థులంతా ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు.

దళిత డిక్లరేషన్‌పై మంత్రి కొప్పుల ఆగ్రహం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ దళిత గిరిజన డిక్లరేషన్ పచ్చి మోసమని ఎస్‌సి అభివృద్ధి, మైనారిటీ సంక్షేమ శాఖా మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. అధికారంలో ఉన్నంత కాలం ఏమి ఒరగబెట్టారని ఇప్పుడు డిక్లరేషన్లు ప్రకటిస్తున్నారని ప్రశ్నించారు. ప్రజల బాగోగులు ఏనాడు పట్టించుకోని వాళ్లంతా ఎన్నికలు వస్తున్నాయానగానే కొత్త పల్లవి ఎత్తు కుంటారని ఎద్దేవా చేశారు. దళితులు, గిరిజనులపై ఏ మాత్రం ప్రేమ ఉన్నా.. తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలు చేయాలని సూచించారు.

వికలాంగుల విద్య, ఉపాధి కోసం ప్రత్యేక విధానాన్ని ప్రకటించాలి

- థెరపీ కేంద్రాలను ప్రభుత్వమే ఏర్పాటు చేయాలి
- సంక్షేమం, సాధికారత కోసం ప్రత్యేక పథకాన్ని ప్రవేశ పెట్టాలి
- వికలాంగుల వాయిస్ మాస పత్రిక వార్షికోత్సవంలో వక్తలు



ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న వక్తలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వికలాంగులకు విద్యా, ఉపాధి కల్పన కోసం ప్రత్యేక విదానాన్ని ప్రకటించాలని, రాష్ట్రంలో 12.2 శాతం జనాభా కలిగిన వికలాంగుల సంక్షేమం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టదా అని వక్తలు ప్రశ్నించారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) రాష్ట్ర కమిటీ నేతృత్వంలో వెలువడుతున్న వికలాంగుల వాయిస్ చైతన్య మాస పత్రిక 9వ వార్షికోత్సవం ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా అడివయ్య, గంగాధర్‌రావు మాట్లాడుతూ దేశంలో 2.68 కోట్ల మంది వికలాంగులు ఉంటే రాష్ట్రంలో 43.04 లక్షల మంది వికలాంగులు ఉన్నారన్నారు. రాష్ట్ర జనాభాలో వీరు 12.2శాతం ఉన్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వీరి సంక్షేమం ఎందుకు పట్టడం లేదని ప్రశ్నించారు. విద్యా, ఉపాధి దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శక్తి సామర్థ్యాలను వెలికి తీయడానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జనాభాకు అనుగుణంగా విద్యా సంస్థలు ఏర్పాటు చేయాలన్నారు. దేశంలో 50 లక్షల మంది ఆటిజం కలిగిన వారున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఐదు లక్షల మంది ఉన్నారని, వీరందరికీ ప్రభుత్వమే ఉచితంగా థెరపీ అందించేందుకు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో, రాష్ట్రంలో వినికిడి లోపం సమస్య కూడా తీవ్రంగా ఉందన్నారు. వికలాంగుల వాయిస్ మాస పత్రిక మేనేజర్ కె వెంకట్ మాట్లాడుతూ వైకల్య ధృవీకరణ పత్రాలు అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. వార్షికోత్సవం ప్రత్యేక సంచికను వొకేషనల్ రిహాబిలిటేషన్ సెంటర్ మాజీ డైరెక్టర్ గంగాధర్ రావు, ఎన్‌పిఆర్‌డి జాతీయ ఉపాధ్యక్షులు ఎం అడివయ్య, వికలాంగుల వాయిస్ మాస పత్రిక మేనేజర్ కె వెంకట్, అసిస్టెంట్ మేనేజర్ బి స్వామి, అసిస్టెంట్ ఎడిటర్ జె రాజు, ఎడిటోరియల్ బోర్డ్ సభ్యులు ఆర్ వెంకటేష్, ఎ రంగారెడ్డి, బలేశ్వర్, సాయమ్మ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎన్‌పిఆర్‌డి నాయకులు, రాష్ట్ర కమిటీ సభ్యులు, వివిధ జిల్లాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

In the Honourable Court of the Motor Accidents Claims Tribunal cum Family Judge cum 3rd Addl. District Judge at Vizianagaram
M.O.P 100/2020

Between :
Gude Roopa @ Rupavathi being minor rep, by Father guardia G.Nagaesh ......Petitioner
And :
Hemasagar Naik etc ...Respondents
R2. M/s Bac Infra Tech P Limited rep. by Somireddy Janardhana Reddy owner of Bolera Jeep TS 08 UD 1219, r/o Plot No.8, Green Park Avenue, JDM Qwuthubullapur, Madchal, Telangana.

NOTICE

Please take notice that the above O.P stands posted to **11-9-2023** for notice to the 2nd Respondent. You should appear in the Person or through an advocate at **10-30A.M** on the above said date in the above court.

If you fail to appear on the said date the above matter will be decided expartee.

U.V.Rajesh.
Advocatefor the petitioners
Vizianagaram

జూబ్లిహిల్స్‌లో బిగ్గిస్ బర్గర్ షాపులో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ బిగ్గిస్ బర్గర్ షాపులో ఆదివారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్-36 బిగ్గిస్ బర్గర్ షాపులో ఒక్కసారిగా పొగలు కమ్ముకున్నాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్థానిక అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. పక్కనే పెట్రోల్‌బంక్ ఉండటంతో స్థానిక ప్రజలు కొద్ది సేపు భయభ్రాంతులకు గురయ్యారు. పోలీస్ అధికారులు పెట్రోల్ బంక్‌ను మూయించి, తమ సమాచారం అందించాకే తిరిగి పెట్రోల్ బంకు ప్రారంభించాలని కోరారు. ప్రాణం నష్టం జరగలేదని, ఆస్తి నష్టం కొంతమేరకు జరిగిందన్నారు. ఈ ఘటన ఎలా జరిగిందో పూర్తి వివరాలు తెలిసిన వెంటనే వివరాలు వెల్లడిస్తామని, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసు అధికారులు తెలిపారు.

దిలీప్ ఘనాటేకు బిఆర్ఎస్ టికెట్ కేటాయించాలి

- ఉమేష్ కుమార్ జీతెన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని గోషామహల్ నియోజకవర్గంలో అధిక సంఖ్యలో మరాఠీలు ఉన్నారని, అక్కడి స్థానిక బిఆర్ఎస్ నాయకుడు దిలీప్ ఘనాటేకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని మరాఠీ భహుసాత్ క్షత్రియ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు ఉమేష్ కుమార్ జెతెన్ కోరారు. ఆదివారం బొగ్గులకుంటలోని చెంప ఎస్టేట్స్‌లోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గోషామహల్ నియోజకవర్గంలో 25 వేలకు పైగా మరాఠీ ఓటర్లు ఉన్నారని, నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ పటిష్టతకు దిలీప్ ఘనాటే ఎంతో కృషి చేశారని తెలిపారు. అలాంటి వారికి బిఆర్ఎస్ పార్టీ టికెట్ కేటాయించాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. సమావేశంలో సమాజ్ ఉపాధ్యక్షులు డాక్టర్ విజయ్ రాన్, ట్రెజరర్ అశ్విన్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఆపరేటర్ మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం ఏడూళ్ల బయ్యారం గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ శాఖ ఆపరేటర్ మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే బూర్గంపాడు మండలానికి చెందిన కొత్తపల్లి రమేష్ మండలంలోని ఏడూళ్ల బయ్యారం విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా ఆదివారం సబ్ స్టేషన్ యార్డ్‌లో ఫీడర్ ఆన్ చేస్తుండగా, ఒక్క సారిగా విద్యుత్ ప్రసరించడంతో షాక్‌కు గురయ్యారు. వెంటనే గమనించిన విద్యుత్ సిబ్బంది పినపాక ప్రభుత్వ అస్పత్రికి వైద్యం కోసం తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మణుగూరు ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లాలని సూచించారు. మణుగూరు ఏరియా ఆస్పపత్రి వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. రమేష్ మృతితో విద్యుత్ శాఖ సిబ్బంది తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

సిఎం కాదు... సింగిల్ డిజిట్ తెచ్చుకోండి

- అమిత్ షా వ్యాఖ్యలపై హరీశ్ ట్వీట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు స్పందించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ట్వీట్ చేశారు. "నూకలు మాకు చెల్లడం కాదు.. తెలంగాణ ప్రజలు నూకలు తినాలని మీ మంత్రి పీయూష్ గోయల్ వెక్కిరించినప్పుడే బిజెపికి ఇక్కడ నూకలు చెల్లిపోయాయి. బ్యాట్ సరిగా పట్టుకోవడం చేతకాని మీ అబ్బాయికి ఏకంగా బిసిసిఐలో కీలక పదవి ఎలా వరించిందో అందరికీ తెలుసు. అలాంటిది మీరు కుటుంబ పాలన గురించి మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉంది. పెద్ద ఎత్తున రైతులు ఉద్యమిస్తే కార్పొరేట్ కొమ్ముకాసే చట్టాలను ఉపసంహరించుకుని తోకముడిచిన మీరా.. రైతు బాంధవుడైన కెసిఆర్‌ను విమర్శించేది. 2జీ 3జీ 4జీ కాదు.. కేంద్రంలో దశాబ్ద కాలంగా నాజీలను మించిన నియంతత్వ పాలన మీది. రాబోయే ఎన్నికల్లో మీరు మాజీలే. సిఎం పదవి కాదు.. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో సింగిల్ డిజిట్ తెచ్చుకునే ప్రయత్నం చేయండి. అబద్ధపు విమర్శలు, అవుట్ డేటెడ్ ఆరోపణలతో రాసిచ్చిన స్క్రిప్టుతో కేంద్రం హోం మంత్రి స్కిట్ చేశారు" అంటూ మంత్రి హరీశ్ రావు ఎద్దేవా చేశారు.

కూలీలను మింగేసిన టిప్పర్

- 44వ ఎన్‌హెచ్‌పై రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జాతీయ రహదారిపై రోడ్డు మరమ్మతులు చేస్తున్న కూలీలపై లారీ వేగంగా దూసుకెళ్లడంతో ఇద్దరు కూలీలు, లారీ క్లీనర్ మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. నిర్మల్ జిల్లా మామడ మండలంలోని బూరుగుపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం రోడ్డు మరమ్మతులు చేస్తున్నారు. అదే సమయంలో నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ వేగంగా టిప్పర్‌ను ఢీకొంది. టిప్పర్ ఇద్దరు కూలీలపై దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో లారీ క్లీనర్‌కు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతి చెందిన కూలీలు బోథ్‌మండలం చించోలి గ్రామానికి చెందిన ప్రసాద్, నేరడిగొండ మండలం బందం గ్రామానికి చెందిన లాల్ సింగ్, లారీ క్లీనర్ ఎపిలోని అనంతపురం జిల్లాకు చెందిన షేక్ ఖాసింగా గుర్తించారు. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పివి శ్రీనివాస్ ఆదర్శప్రాయులు

- తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ గౌరీ శంకర్
- నవతెలంగాణకు పివి పునాది : అసిస్టెంట్ ఎడిటర్ వేణుమాధవ్
- భద్రాచలంలో పివి సంస్మరణ సభ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చరిత్రలో ఎవరి పేజీ వారి రాసుకుంటారని, అలా పివి శ్రీనివాస్ కూడా విద్యార్థి దశ నుంచే ఉద్యమాల్లో పాల్గొంటూ యువజన స్థాయిలో ప్రజా ఉద్యమాలను బలంగా నిర్మించి యువతకు ఆదర్శంగా నిలిచారని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ గౌరీ శంకర్ అన్నారు. నవతెలంగాణ దినపత్రిక మాజీ సిజిఎం పివి శ్రీనివాస్ సంస్మరణ సభ ఆదివారం భద్రాచలం పట్టణంలోని కెకె ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సభకు తెలుగు రాష్ట్రాల నుంచి ఆయన స్నేహితులు, అభిమానులు, పార్టీ నాయకులు, బంధువులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. భద్రాచలం మాజీ జడ్‌పిటిసి సభ్యులు గుండు శరత్ అధ్యక్షతన జరిగిన ఈ సంస్మరణ సభకు గౌరీ శంకర్ హాజరై ప్రసంగించారు. పివిలో అనేక గొప్ప కోణాలు దాగి ఉన్నాయని, సిపిఎంని ఎంతో గొప్పగా గౌరవించారని అన్నారు. 1980-90 దశాబ్దాల్లో వచ్చిన యువతకు సామాజిక స్పృహ ఎంతగానో ఉందని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ప్రజల కోసం పనిచేసే వారు ఉద్యమ భావజాలాలను కలిగి ఉంటారని, అటువంటి వారి కోవలో పీవీ శ్రీనివాస్ పయనం జరిగిందని, అయన్ను నేటి యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని కోరారు.

నవతెలంగాణ అసిస్టెంట్ ఎడిటర్ వేణుమాధవ్ మాట్లాడుతూ.. నవతెలంగాణకు పివి శ్రీనివాస్ పునాది లాంటివారని అన్నారు. పత్రికను నిలబెట్టడంలో ఆయన సహకారం మరువలేనిదని తెలిపారు. పత్రికా ప్రారంభంలో అందులో పని చేసే స్టాఫ్‌లో చైతన్యం తీసుకొచ్చి పత్రిక ఎదుగుదలకు ఎంతగానో దోహదపడ్డారని గుర్తుచేశారు. పత్రిక, పార్టీ నిర్మాణంలో క్రియాశీలక పాత్ర పోషించారని, నిరంతరం అధ్యయనం మీదనే ఆయన ఫోకస్ పెట్టారని తెలిపారు. తెలంగాణ బుక్ ట్రస్ట్ సెక్రటరీ కె చంద్రమోహన్ మాట్లాడుతూ.. పివితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. టివి 5 ఎడిటర్ వైజే రాంబాబు మాట్లాడుతూ.. మంచి మిత్రున్ని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కిషోర్ రెడ్డి మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతం నుంచి వచ్చి ఓ పత్రికకు సిజిఎం స్థాయికి ఎదగటం.. పివిలో వృత్తి నిబద్ధతకు నిదర్శనమన్నారు. పివి సతీమణి జ్యోతి మాట్లాడుతూ.. తమ అనుబంధాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో నవతెలంగాణ ఉభయ ఖమ్మం జిల్లా బ్రాంచ్ మేనేజర్ జావిద్, విధాత డిజిటల్ మీడియా ఎడిటర్ తాళ్లూరి జగన్మోహన్, సిపిఎం భద్రాచలం నియోజకవర్గం కో కన్వీనర్ కారం పుల్లయ్య, డిసిసిబి మాజీ చైర్మన్ యలమంచిలి రవికుమార్, భద్రాచలం ఎంఇఒ సమ్మయ్య, సిపిఎం భద్రాచలం మండల కార్యదర్శి గడ్డం స్వామి, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక స్పృహతోనే కుటుంబ సంక్షేమ నిధి ఏర్పాటు

- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, టిఎస్‌యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి చావ రవి
- మరణించిన టీచర్ కుటుంబానికి రూ.ఆరు లక్షల చెక్కు అందజేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సామాజిక స్పృహతోనే టిఎస్‌యుటిఎఫ్ ఆధ్వర్యంలో కుటుంబ సంక్షేమ నిధి ఏర్పాటు చేసినట్టు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని కొత్వాల్ గూడ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, టిఎస్ యుటిఎఫ్ సభ్యురాలైన హెబ్సిక (50) గుండెపోటుతో మరణించారు. ఆదివారం ఆమె దశదిన కర్మను శంషాబాద్‌లోని మిషన్ కాంపౌండ్‌లో నిర్వహించగా, కార్యక్రమానికి ఎమ్మెల్సీ నర్సిరెడ్డితో పాటు టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి హాజరై.. మృతురాలి భర్త ప్రవీణ్‌కుమార్‌కు రూ.ఆరు లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లాలో ఇద్దరు ఉపాధ్యాయులు అకాల మరణం చెందడంతో చందాలు వేసుకొని వారి కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున రూ.20 లక్షలు అందజేశామన్నారు. ఉపాధ్యాయులు అకాల మరణం చెందినప్పుడు వారి కుటుంబాలు వీధిన పడకుండా తక్షణ సహాయం చేయాల నే ఉద్దేశంతో సంఘం ఆధ్వర్యంలో ఫ్యామిలీ వెల్ఫేర్ ఫండ్ (ఎఫ్‌డబ్ల్యుఎఫ్)ను జులై 1న ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సంక్షేమ నిధి ఏర్పాటు చేసిన అనంతరం ఇద్దరు ఉపాధ్యాయులు అకాల మరణం చెందారన్నారు. ఇటీవల భద్రాచలంలో కొండయ్య (44) అనే ఉపాధ్యాయుడు గుండెపోటుతో మరణించగా, ఆయన కుటుంబం అత్యంత దయనీయ స్థితిలో ఉందని గ్రహించి, వారం రోజుల్లో ఆ కుటుంబానికి రూ.ఆరు లక్షలు అందజేశామని తెలిపారు. హెబ్సిక అంకితభావం, క్రమశిక్షణ, నిబద్ధత, పిల్లల పట్ల ప్రేమ ఆప్యాయత కలిగిన టీచర్ అని కొనియాడారు. ఆమె కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఆమె భర్త కూడా తీవ్ర అనారోగ్యంతో బాధపడు తున్నప్పటికీ మానసికంగా కృంగి పోకుండా తన ఇద్దరు పిల్లలను చక్కగా చదివించి భవిష్యత్తు లో ప్రయోజకులుగా మారేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వపరమైన అన్ని మరణ సంబంధిత సదుపాయాలు అందించేందుకు తమ సంఘం బాధ్యత తీసుకుంటుందన్నారు. ఎయిడెడ్ స్కూళ్లలో విధులు నిర్వహించే ఉపాధ్యాయులకూ ఎఫ్‌డబ్ల్యుఎఫ్‌లో సభ్యత్వం ఇవ్వాలని శంషాబాద్ ఎంబిహెచ్ఎస్ హెడ్మాస్టర్ పి అనిత విజ్ఞప్తి చేశారు. దీనికి వారు స్పందిస్తూ ఇప్పటికే ఎయిడెడ్ స్కూల్‌లో పనిచేసే ఉపాధ్యాయులూ టిఎస్‌యుటిఎఫ్, ఎఫ్‌డబ్ల్యుఎఫ్‌లో సభ్యులుగా ఉన్నారని, వారికీ సంఘం తరపున సహాయం అందుతుందని తెలిపారు. ఎఫ్‌డబ్ల్యుఎఫ్ నిరంతరం కొనసాగిస్తామని ఉపాధ్యాయులు ఐకమత్యంతో సంఘటిత పోరాటాల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రభుత్వం సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ పునరుద్ధరించేలా సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టి ఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ఎఫ్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, టిఎస్‌యుటిఎఫ్ కార్యదర్శి ఇ గాలయ్య, విఓటిటి ప్రధాన సంపాదకులు పి మాణిక్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు కె గోపాల్‌నాయక్, ప్రధాన కార్యదర్శి వెంకటప్ప, సీనియర్ నాయకులు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నిధి శర్మిష్ట నాట్యం నవరస సహితం

ప్రజాశక్తి - కల్చరల్

చక్కని తల్లికి చాంగు భళా చక్కని మోవికి చాంగు భళా అన్నమయ్య జానపద శైలిలో రాసిన కీర్తనను నిధి పద ముద్రలలో మెళుకువలతో చురుకుగా నర్తించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. ప్రముఖ నాట్య గురువు దీపికా రెడ్డి శిష్యురాలు నిధి శర్మిష్ట రెడ్డి కూచిపూడి రంగప్రవేశం రవీంద్రభారతి ప్రధాన వేదికపై జరిగింది. నిధి తొలి అంశంగా వెంకట సుబ్బయ్య కృతి ప్రణవాకరం తో నృత్యాన్ని ఆరంభించి రామదాసు కీర్తన తక్కువేమీ మనకు రాముడు వొక్క దుండు వరకులో భక్తి రసాన్ని అభినయ ప్రదానంగా నర్తించారు. గురువు దీపికా రెడ్డి నటువాంగం చేయగా డిఎస్‌వి శాస్త్రి గానం మధురంగా వుంది. మృదంగంపై రాజగోపాలాచర్య వాయులీనం పై సాయి కుమార్, వేణువు పై మురళి సహకరించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ నాట్యం ఏకాగ్రత క్రమశిక్షణ నేర్పుతుందన్నారు. గురువు ప్రతిభాంతులైన శిష్యులు ఆ స్థాయిలో రాణి స్తారని దీపికా రెడ్డి. నిధి గురు శిష్య బంధం గొప్పదని అన్నారు. వేదికపై గంగుల ప్రతాప రెడ్డి, అనన్య తదితరులు పాల్గొని నిధిని అభినందించారు

ఎంఎంటిఎస్‌కు మంగళం!

- వంద రోజుల్లో 60 రోజులు సర్వీసులు రద్దు
- ఒఆర్ 50 శాతం దాటట్లేదంటున్న అధికారులు
- రెండో దశ అంటూ మరో రాజకీయ రూట్‌మ్యాప్
- వందేభారత్ కోసం పేదల ప్రజారవాణాకు బ్రేక్
- సర్వీసులు రద్దు చేసి తనిఖీలంటూ నాటకాలు
- అనాలోచితంగా కేంద్ర రైల్వే మంత్రిత్వశాఖ నిర్ణయాలు

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

అవును... కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ హైదరాబాద్‌లో ఎంఎంటిఎస్ (మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టం) రైళ్లకు మంగళం పాడేందుకు ప్రయత్నిస్తోంది. సర్వీసుల సంఖ్యను క్రమంగా తగ్గిస్తూ, ఇష్టం వచ్చినట్టు ట్రిప్పులు రద్దు చేస్తూ, పట్టణ ప్రయాణీకులు సబర్బన్ రైలు ఎక్కేందుకు వీలులేని పరిస్థితుల్ని సృష్టిస్తుంది. ఆక్యుపెన్సీ రేషియో (ఒఆర్) 50 శాతం దాటట్లేదని ప్రచారం చేస్తూ చౌకైన ప్రజా రవాణా వ్యవస్థను ప్రయాణీకులకు దూరం చేస్తోంది. ఒఆర్‌ను సాకుగా చూపి, శాశ్వతంగా వీటిని రద్దు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. శివారు ప్రాంతాల ప్రజలు తక్కువ ఖర్చుతో సిటీలోకి రావడానికి ఉన్న ఏకైక ప్రజారవాణా వ్యవస్థ ఎంఎంటిఎస్. ఇప్పటికే పేదలు ప్రయాణించే ప్యాసింజర్ రైళ్లను రద్దు చేయడం, ఉన్న కొన్ని ప్యాసింజర్ రైళ్లలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల చార్జీలు వసూలు చేయడం వంటి ఆర్థిక దోపిడీకి ఒడిగడుతున్న మోడీ సర్కారు ఇప్పుడు ఎంఎంటిఎస్‌కే ఎసరు పెట్టింది. గడచిన వంద రోజుల్లో 60 రోజులు పాటు ఎంఎంటిఎస్ రైళ్లు రద్దు అయ్యాయి. ఆగస్టు 14 నుంచి ఇప్పటి వరకు అసలు ఈ రైలు పట్టాలే ఎక్కలేదు. పైగా సెప్టెంబర్ మూడు వరకు నడిపేదిలేదని దక్షిణ మధ్య రైల్వే ముందస్తు ప్రకటన కూడా చేసింది. సామాన్య ప్రజలతో పాటు రైల్వే ఉద్యోగులూ ఎంఎంటిఎస్‌లో ఎక్కువ సంఖ్యలో ప్రయాణిస్తారు. హైదరాబాద్ సిటీలో వేలల్లో ఇళ్ల కిరాయిలు కట్టలేని పేద, మధ్య తరగతి ప్రజలు శివారు ప్రాంతాల్లో తక్కువ అద్దెకు ఇళు దొరుకుతాయని అక్కడకు వెళ్తుంటారు. అక్కడి నుంచి ఎంఎంటిఎస్ ద్వారా సిటీలో పనులకు వచ్చి వెళ్తుంటారు. ఎంఎంటిఎస్‌లో కనిష్ట టిక్కెట్ ధర రూ.5 కాగా, గరిష్ట టిక్కెట్ ధర కేవలం రూ.15 మాత్రమే. ఈ చార్జీలతో దాదాపు సిటీ చుట్టుపక్కల 45 కిలోమీటర్ల లోపు ప్రయాణం చేయొచ్చు. కోవిడ్ టైంలో అన్ని రైళ్ల మాదిరే ఎంఎంటిఎస్ సర్వీసుల్నీ రద్దు చేశారు. ఆ తర్వాత అన్ని రైళ్లను పునరుద్ధరించి, 15 నెలల తర్వాత తిరిగి ఎంఎంటిఎస్ సర్వీసుల్ని ప్రారంభించారు. మధ్య మధ్యలో ఎప్పుడు పడితే అప్పుడు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా రైళ్లను రద్దు చేయడంతో శివారు ప్రజలు నానా అవస్థలు పడ్డారు. ఎంఎంటిఎస్ ఎక్కేందుకు రైల్వే స్టేషన్‌కు వచ్చి, రైళ్లు లేవని తెలియగానే అక్కడి నుంచి మళ్లీ బస్టాండ్లు, మెట్రో స్టేషన్లకు ఉరుకులు పరుగులు పెట్టాల్సిన దుస్థితిని దక్షిణ మధ్య రైల్వే కల్పించింది. ఈ పరిస్థితిని సృష్టించిన రైల్వే అధికారులే ఇప్పుడు ఒఆర్ 50 శాతానికి మించట్లేదని లెక్కలు కడుతు న్నారు. అందువల్లే రైళ్లను రద్దు చేయాల్సి వస్తోందని వివరణ ఇస్తున్నారు. అసలు రైళ్లను రెగ్యులర్‌గా నడిపితేనే కదా ఒఆర్ పెరిగేది. దాన్ని వదిలేసి 50 శాతానికి మించట్లేదనడం ఏంటని ప్రయాణీకులు ప్రశ్నిస్తున్నారు. ఎంఎంటిఎస్ తొలి దశ 45 కిలో మీటర్లు ఉండగా, రెండోదశతో ఇది 90 కి.మీ., పెరిగింది. తొలి దశ 45 కి.మీ., సమయంలో 121 సర్వీసులు నడిచేవి. అరగంటకో రైలు ప్రయాణీకులకు అందుబాటులో ఉండేది. తొలుత ఆరు బోగీలతో నడిచిన ఎంఎంటిఎస్, ఆ తర్వాత తొమ్మిది బోగీలకు పెరిగింది. ప్రయాణీకుల రద్దీ ఎక్కువ అవడంతో బోగీల సంఖ్యను 12కి పెంచారు. రోజుకు దాదాపు లక్షన్నర మంది ప్రయాణీకులు ఈ రైళ్లలో ప్రయాణించేవారు.

ఇప్పుడు ప్రయివేటు రంగంలోని మెట్రోరైల్‌ను ప్రోత్సహించడం కోసం ఎంఎంటిఎస్‌ను బలి చేస్తున్నారని ప్రయాణీకులు అభిప్రాయపడు తున్నారు. ఒఆర్ తగ్గితే తక్కువ బోగీలతో అయినా సర్వీసుల్ని ఎందుకు నడపట్లేదని ప్రశ్నిస్తున్నారు.

వందేభారత్ కోసం...

మోడీ సర్కార్ ఉన్న రైళ్లను రద్దు చేసి, వాటిస్థానంలో వందేభారత్ అంటూ పేరు మార్చి నడుపుతున్న రైళ్ల కోసం ఎంఎంటిఎస్‌ను బలి చేస్తున్నారు. దానితో పాటు పక్కా వ్యాపారీకరణలో భాగంగా ఎంఎంటిఎస్ వెళ్లాల్సిన రూట్లలో సరుకు రవాణా రైళ్లను నడుపుతున్నారు. ఎంఎంటిఎస్ టిక్కెట్ ధర తక్కువగా ఉండటం వల్ల ఆదాయం రావట్లేదనీ, ఎటూ కోవిడ్ టైంలో ప్రజలు ప్రత్యామ్నాయ రవాణాకు అలవాటు పడ్డారు కాబట్టి, ఇప్పుడు ఆ సర్వీసుల్ని తిప్పాల్సిన అవసరం లేదని రైల్వే అధికారులు భావిస్తున్నారని రైల్ నిలయంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి అభిప్రాయపడ్డారు.

రెండో దశ రాజకీయం

ఎంఎంటిఎస్ రెండో దశ పేరుతో కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ మరో నాటకానికి తెరలేపింది. దీనిపై సికింద్రాబాద్ లోక్‌సభ సభ్యులు, కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి కూడా అనేక ప్రకటనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కలిసిరావట్లేదని, తన వాటా నిధులు ఇవ్వట్లేదని ఆరోపణలు చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కూడా ధీటుగానే సమాధానం చెప్పింది. తొలి దశ ఎంఎంటిఎస్ రైళ్లనే సక్రమంగా నడపట్లేదనీ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి డబ్బు తీసుకొని సరకు రవాణా రైళ్లను ఆ ట్రాక్‌లపై తిప్పుతున్నారని ఆరోపిస్తుంది. రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడని సర్వీసులకు డబ్బు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నిస్తున్నారు. ఎంఎంటిఎస్ తొలి విడత రెండో దశ మార్గం ప్రాజెక్ట్ వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.160 కోట్లు ఇవ్వాలని పేర్కొన్నారు. తొమ్మిదేళ్లు నానబెట్టి, ఇప్పుడు ప్రాజెక్ట్ వ్యయం పెరిగిందనీ, రాష్ట్ర వాటాగా రూ.600 కోట్లు ఇవ్వాలని దక్షిణ మధ్యరైల్వే అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసారు. ప్రాజెక్ట్ ఆలస్యానికి కారణాలు ఏంటి? ఖర్చు ఎందుకు పెరిగింది? అనే వివరాలు ఏవీ చెప్పకుండా రూ.600 కోట్లు కట్టాలని చెప్పడం ఏంటని రాష్ట్ర ఆర్థిక శాఖ ఉన్నతాధికారి ఒకరు వ్యాఖ్యానించారు. తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ఎంఎంటిఎస్ రైలు మార్గాల్ని కాదని, వేల కోట్ల వ్యయంతో కూడిన హైదరాబాద్ మెట్రోరైల్ ప్రాజెక్ట్ రెండో దశకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం గమనార్హం. ఎంఎంటిఎస్ రైళ్లను ఎందుకు నడపట్లేదనే విషయంపై కేంద్రమంత్రి జీ కిషన్‌రెడ్డి నోరుమెదపకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

ఇదో నాటకం!

ఎంఎంటిఎస్‌ను చంపేయడం కోసం రైల్వే ఉన్నతాధికారులు పడుతున్న తపన కాస్తా కూస్తా కాదు. ఈనెల 21 నుంచి 27వ తేదీ వరకు ఎమ్ఎమ్‌టీఎస్ రైళ్లను రద్దు చేస్తున్నట్టు రైల్వే అధికారులు ప్రకటించారు. కానీ ఈనెల 24వ తేదీ దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ సికింద్రాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ భరతేష్‌కుమార్ జైన్‌తో కలిసి ఎంఎంటిఎస్ రైలులో ప్రయాణించి తనిఖీలు చేశారు(ట). సికింద్రాబాద్-లింగంపల్లి మధ్య వారు ప్రయాణీకులతో కూడా మాట్లాడారని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఓ పత్రికా ప్రకటన పంపారు. సదరు జనరల్ మేనేజర్ తన బృందంతో కలిసి ఎమ్ఎమ్‌టీఎస్ ట్రైన్ నెంబర్ 47160లో సికింద్రాబాద్ నుంచి లింగంపల్లి వరకు ప్రయాణించి, అక్కడి సౌకర్యాలను పరిశీలించి, తిరిగి ట్రైన్ నెంబర్ 47188లో లింగంపల్లి నుంచి సికింద్రాబాద్ వెళ్లారని తెలిపారు. ఈ రెండు నెంబర్ల రైళ్లఫలక్‌నుమా నుంచి లింగంపల్లికి, లింగంపల్లి నుంచి ఫలక్‌నుమాకు వెళ్తాయి. ఈ రైలులో ఒకరిద్దరు ప్యాసింజర్లతో రైల్వే జీఎం మాట్లాడుతున్న ఫోటోలను కూడా పంపారు. ఈ ట్రిప్ 24వ తేదీ జరిగింది. తెల్లారి 25వ తేదీన ఈనెల 28 నుంచి సెప్టెంబర్ 3వ తేదీ వరకు ఎమ్ఎమ్‌టీఎస్ రైళ్లను రద్దు చేస్తున్నట్టు ప్రకటన జారీ చేశారు. ప్రజారవాణాపై ఉన్నతస్థాయి అధికారులకు ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో దీనితో అర్థమవుతుందని ప్రయాణీకులు వాపోతున్నారు.

శుభవార్త వింటారు

ద.మ.రైల్వే జీఎమ్ అరుణ్‌కుమార్ జైన్

ఎంఎంటిఎస్ రైళ్ల విషయంలో త్వరలో శుభవార్త వింటారని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ చెప్పారు. ఆ రైళ్లలో 50 శాతం ఒఆర్ కూడా రావట్లేదనీ, ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నామని అన్నారు. రైల్వే స్టేషన్ల ఆధునీకరణ, ట్రాక్‌ల పొడిగింపు వంటి కొన్ని పనుల వల్ల ఈ రైళ్ల రద్దు అనివార్యమవుతున్నదని వివరణ ఇచ్చారు. ముఖ్యంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఆధునీకరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయనీ, రైళ్ల రద్దీకి తగినట్టు ట్రాక్‌లు లేవని చెప్పారు.

కరపత్రాలను విడుదల చేస్తున్న చేనేత కార్మికులు

4 నుంచి రాష్ట్ర చేనేత కార్మిక సంఘం ద్వితీయ రాష్ట్ర మహాసభ

- రాష్ట్ర అధ్యక్షులు గంజి మురళీధర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ చేనేత కార్మిక సంఘం ద్వితీయ రాష్ట్ర మహాసభ సెప్టెంబర్ 4, 5వ తేదీల్లో నల్లగొండ పట్టణ కేంద్రంలో నిర్వహిస్తున్నామని, ఈ మహాసభను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంజి మురళీధర్ పిలుపునిచ్చారు. ఆదివారం నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల కేంద్రంలోని చేనేత కార్మికుల ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభ విజయవంతం కోసం కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, నేటి తెలంగాణలో చేనేత వస్త్ర పరిశ్రమ, చేనేత కార్మికుల సమస్యలపై 70 ఏళ్లుగా గల్లీ నుంచి ఢిల్లీ వరకు అనేక ఆందోళనా పోరాటాలను నిర్వహించామని తెలిపారు. చేనేత వస్త్ర పరిశ్రమకు ఉపయోగకరంగా ఉన్న జాతీయ చేనేత బోర్డుతో పాటు మహాత్మాగాంధీ బోనకల్ బీమా యోజన, ఐసిఐసిఐ లాంబార్డ్ హెల్త్ స్కీమ్స్, హౌస్ కం వర్క్ లాంటి కేంద్ర పథకాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న చేనేత పరిశ్రమ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా చేనేత కార్మికులందరూ ఐక్యమై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. చేనేత సహకార సంఘాలు అప్పుల్లో కూరుకుపోయి సంఘంలోని సభ్యులకు పని కల్పించలేని పరిస్థితిలోకి నెట్టి వేయబడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు చేనేత కార్మికులకు అందడంలేదన్నారు. ఈ నేపథ్యంలో చేనేత సహకార సంఘాలు, సహకార ఇతర రంగంలో పనిచేస్తున్న కార్మికుల వస్త్ర పరిశ్రమ సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం కోసం ఈ రాష్ట్ర మహాసభ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కర్నాటి శ్రీరంగం, రావిరాల వెంకటేశ్వర్లు, రాపోలు అయోధ్య, రాపోలు జనార్దన్, రాపోలు గోవర్ధన్, రాపోలు పద్మ, రావిరాల ధనమ్మ, చెరువుపల్లి వెంకటయ్య, కుక్కుల యాదగిరి, కొలను సత్యనారాయణ, కొలను శంకరయ్య, పొట్టబత్తుల పరమేష్, కొక్కుల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ కేసులో చేతివాటం

- రాయదుర్గం ఎస్ఐ అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐ రాజేందర్ డ్రగ్స్ కేసులో చేతివాటం ప్రదర్శించి అరెస్ట్ కావడం సంచలనంగా మారింది. డ్రగ్స్ సరఫరాపై సైబరాబాద్ పోలీసులు ఓ వైపు ఉక్కుపాదం మోపుతుంటే.. మరోవైపు సైబరాబాద్ పరిధిలోనే పనిచేస్తున్న పోలీసులు డ్రగ్స్ సరఫరాలో కీ రోల్ పోషిస్తున్నారు. నార్కోటిక్ విభాగం అధికారులు వలపన్ని పట్టుకోవడంతో అతడి అవినీతి బయటపడింది. సైబరాబాద్ సైబర్ క్రైమ్ విభాగంలో (సిసిఎస్) నార్కోటిక్ టీమ్‌లో రాజేందర్ ఎస్ఐగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో మహారాష్ట్రలో చేసిన ఓ అపరేషన్‌లో పాల్గొన్న రాజేందర్ అక్కడ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన డ్రగ్స్‌ను కోర్టులో డిపాజిట్ చేసే సమయంలో తక్కువగా ఉండటంతో పోలీసులకు అనుమానం వచ్చింది. రాజేంద్రనగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న ఎస్ఐ రాజేందర్ ఇంట్లో తనిఖీలు చేసిన పోలీసులు అక్కడ సుమారు 1,750గ్రాముల డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్ఐ రాజేందర్‌పై రాయదుర్గం పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా, రాజేందర్‌పై గతంలోనూ అవినీతి ఆరోపణలు ఉన్నట్టు సమాచారం. రాయదుర్గం ఎస్ఐగా పనిచేస్తున్నప్పుడు ఎసిబికి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. అప్పట్లో అతన్ని సర్వీస్ నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. అయితే ఆ ఉత్తర్వులపై కోర్టు నుంచి రాజేందర్ స్టే తెచ్చుకున్నారు.

సంస్కారం నేర్పని విద్యా విధానం సమాజానికి నష్టం

ప్రజాశక్తి - కల్చరల్

ప్రస్తుతం మన విద్యావిధానం కేవలం ధన సంపాదకు మాత్రమే అన్నట్లు రూపొందించారని దీనివల్ల విద్యార్థులలో సంస్కారం లోపిస్తోందని రామకృష్ణా మఠం ప్రతినిధి శితికంతానంద స్వామీజీ అన్నారు. సంస్కారాన్ని నేర్పని విద్య వల్లనే నేడు సమాజంలో అవినీతి, అక్రమాలు, లంచగొండితనం పెరిగిందని చెప్పారు..శ్రీ త్యాగరాయ గాన సభ ప్రధాన వేదిక పై సెయింట్ ఆడమ్స్ హై స్కూల్ నిర్వహణలో తల్లితండ్రులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ప్రధాన వక్తగా హాజరు ఐన శితికంతానంద మాట్లాడుతూ పిల్లలలో వున్న ప్రతిభను గుర్తించి వెలుగులోకి తెచ్చే బాధ్యత తల్లితండ్రులదేనన్నారు. పిల్లలలో ఏకాగ్రతకు ధ్యానం ఉపయోగమని అది విద్యాలయల్లో నేర్పాలని కానీ తల్లితండ్రులు కేవలం రాంకులే ప్రధానంగా భావించటం వల్ల నైతిక విలువలు బోధన మానసిక యోగ వంటివాటి గురించి పట్టించుకోవడంలేదన్నారు. పిల్లలకు అవి నేర్పితే తల్లిదండ్రులు తమ పిల్లలు వైరాగ్యంలోకి వెళ్లిపోతారని భావిస్తున్నారని అన్నారు. పోటీ చదువులో కాకుండా వ్యక్తిత్వ నిర్మాణంలో వుండాలని దీనికి నిజాయితీ త్యాగం ప్రేమ ను నేర్పే విద్యాలయాలలో తమ పిల్లలను చేర్చాలని కోరారు.సమాజంలో ఏ వృత్తి తక్కువ కాదని వివిధ వృత్తి నైపుణ్యాలు పిల్లలకు నేర్పాలని కృతిమ మేధ పెరుగుతున్న తరుణంలో ఐటి

రంగంలో ఉద్యోగ భద్రత అనుమానమేనని విదేశాల్లో పని సంస్కృతికి గౌరవం వుందని మనదేశం ఇంకా ఆ స్థితి రాలేదని అన్నారు ప్రిన్సిపల్ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యావిధానం తాము ఆచరిస్తున్నామని తెలిపారు. ప్రభాకరరావు దేశ భక్తి గీతాలు ఆలపించారు.ఈ సందర్భంగా ఉచ్చారణ పోటీలలో విజేతలకు బహుమతులను అంద జేశారు.

జీవితాల్లో వెలుగులు

- ఎస్‌సి, ఎస్‌టి డిక్లరేషన్ ప్రకటనపై గాంధీభవన్‌లో సంబురాలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం చేవెళ్లలో ప్రకటించిన ఎస్‌సి, ఎస్‌టి డిక్లరేషన్ ప్రకటన నేపథ్యంలో ఆదివారం గాంధీభవన్‌లో సంబురాలు చేసుకున్నారు. బాణ సంచా పేల్చి, మిఠాయిలు పంచుకున్నారు. నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ఆదివాసి, దళిత సంఘాల నాయకులు ఉత్సాహంలో ఉత్సవాలలో పాల్గొని ఆనందాన్ని వ్యక్తం చేశారు. అంబేద్కర్ అభయహస్తం పేరు మీద ప్రతి పేద దళిత కుటుంబానికి రూ.12 లక్షలు ప్రకటించడం చారిత్రాత్మకమని అన్నారు. దళిత, గిరిజన డిక్లరేషన్ ట్రైలర్ మాత్రమే పూర్తి మ్యానిఫెస్టోతో మా పూర్తి సినిమా చూపిస్తామని నేతలు ప్రకటించారు.

టిపిసిసి ఎస్‌సి విభాగం చైర్మెన్ ప్రీతం మాట్లాడుతూ రాష్ట్రంలో దళిత, గిరిజనుల అభ్యున్నతే లక్ష్యంగా శనివారం చేవెళ్ల సభలో ఎస్‌సి, ఎస్‌టి డిక్లరేషన్ ప్రకటించామని తెలిపారు. ఆదివాసి కాంగ్రెస్ పార్టీ చైర్మెన్ బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో దళిత, ఆదివాసి, గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ కోసం ప్రతిపాదనలు పంపడంలో గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ విఫలమయ్యారని విమర్శించారు. తమ పార్టీని విమర్శించే స్థాయి మంత్రికి లేదన్నారు.